www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 2 సెప్టెంబర్ 2024

5

అన్నమయ్య

మదనపల్లెలో పేలిన ఐపి బాంబ్

- కోర్టులో రూ.2.5 కోట్లకు ఐపి దాఖలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణంలో ఐపి బాంబ్ పేలింది. బాలాజీ ఆటో మొబైల్స్ స్పేర్ పార్ట్స్ వ్యాపారం చేసే యజమాని భాను ప్రకాష్ రూ.2.5 కోట్లకు ఐపి దాఖలు చేశారు. ఇందుకు సంబంధించి న్యాయవాది తెలిపిన వివరాల మేరకు వివరాలు.. మదనపల్లి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ అనుకుని గత కొన్ని ఏళ్లుగా బాలా జీ స్పేర్ పార్ట్స్ అండ్ ఆటో మొబైల్స్ పేరుతో ఆటోమొబైల్ షాపు భాను ప్రకాష్ నిర్వహించేవారు. స్థానికంగా ఉన్న సుమారు 34 మంది వద్ద రూ.2.5 కోట్లు అప్పులు చేశారు. వ్యాపారాల్లో నష్టాలు రావడంతో స్థానిక సబ్ కోర్టులో ఐపి దాఖలు చేసినట్లు తెలిపారు.

సా..గుతున్న ఖరీఫ్..!

- ముగింపులోనూ ఊగిసలాటే
- కడపలో 45.51 శాతం సాగు
- అన్నమయ్యలో 28 శాతం

ఖరీఫ్ సీజన్ ముగింపు దశలోనే ఊగిసలాటే కనిపిస్తోంది. జూన్ ప్రారంభంలో అధిక వర్షపాతం నమోదవడంతో ఆశలు రేకెత్తించింది. నాలుగో వారం నుంచి జులై, ఆగస్టు చివరి వరకు వర్షపాతం మందగించడంతో సాగు ఆశించిన రీతిలో సాగలేదు. ఆగస్టులో కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేయడంతో ఆశావహంగా సాగుతోందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి రోజూ సాయంత్రానికి ఆకాశం కారు మబ్బులతో ఆశలు రేకెత్తించడం, చివరకు ఉస్సూరుమనిపించడం పరిపాటిగా మా రింది. ఇటువంటి వ్యతిరిక్త పరిస్థితుల్లో కడప జిల్లాలో 45.51 శాతం, అన్నమయ్యలో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి స్థాయిలో విత్తనం పడాల్సి ఉంది. ఇటువంటి విభిన్న పరిస్థితుల నేపథ్యంలో మేఘుడు దోబూచులాడుతున్నాడు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ మందగమనంలో సాగుతోంది. కడప జిల్లాలో 1,85,716 ఎకరాలు, అన్నమయ్య జిల్లాలో 1,61,612 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేయాలనేది వ్యవసాయ శాఖల లక్ష్యం. కడప జిల్లాలో జూన్, జులై, ఆగస్టు మాసాల్లో నుంచి 84,528 ఎకరాల్లోనే విత్తనం పడింది. 36.11 శాతం, అన్నమయ్య జిల్లాలో 28,403 ఎకరాల్లోనే విత్తనం పడింది. కడప జిల్లాలో 45.51 శాతం, అన్నమయ్య జిల్లాల్లో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. ఉభయ జిల్లాల్లో మిగిలిన పొలమంతా బీడుగా దర్శనమిస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఉభయ జిల్లాల రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. పొలంలో విత్తనం విత్తడానికి అన్ని విధాలుగా సిద్ధమైన తరుణంలో మేఘం ముఖం చాటేయడం నిరుత్సాహాన్ని కలిగించింది. కడప జిల్లాలో ప్రధాన పంట వరి పంట 76,992 ఎకరాలకు గానూ 24,418 ఎకరాలు, వేరుశనగ పంట 14,748 ఎకరాల్లో సాగుకుగానూ 6,792 ఎకరాలు, మినుములు 6,525 ఎకరాల సాగు లక్ష్యాన్ని అధిగమించి 16,603 ఎకరాలు, కంది 9,618 ఎకరాలకు గానూ 7,643 ఎకరాలు, పత్తి 24,086 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా, 19,646 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడింది. అన్నమయ్య జిల్లాలో ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు 44,046 ఎకరాల్లోనే విత్తనం పడింది. జిల్లాలో 28 శాతం విస్తీర్ణంలోనే విత్తనం పడింది. జిల్లా ప్రధాన పంట వేరుశనగ. జిల్లాలో 1,18,275 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,05,844 ఎకరాల్లో విత్తనం పడింది. వరి 24,077 ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉండగా 11,124 ఎకరాల్లో విత్తనం పడింది. ఈలెక్కన 28 శాతం విస్తీర్ణంలో విత్తనం పండింది. మిగిలిన పొలమంతా బీళ్లుగానే దర్శనమిస్తోంది.

వెంటాడిన వర్షాభావం

జులై, ఆగస్టు మాసాలను వర్షాభావం వెంటాడింది. 96.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఫలితంగా కడప జిల్లాలో ఖరీఫ్ మందగమనంలోనే కొనసాగుతోంది. ఒక నెలలో కురవాల్సిన వర్షపాతాన్ని, రెండు, మూడు రోజుల్లో కురవడం తరువాత ముఖం చాటేయడంతో దుక్కులు చదును చేసుకోవడానికి సరిపోతోంది. విత్తనం వేయడానికి మరో పదునుపాటు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఫలితంగా సాగు నత్తనడకన సాగుతోంది. అన్న మయ్య జిల్లాలోని 16 మండలాలు మిగులు వర్షపాతాన్ని కలిగి ఉన్నాయి. మరో 10 మండలాలు సాధారణ వర్షపాతాన్ని కొనసాగిస్తుండడం గమనార్హం. మిగి లిన నాలుగు మండలాల్లో లోటువర్షపాతం కొనసాగుతోంది. రైల్వేకోడూరు, మదనపల్లి ప్రాంతాలు మినహాయి స్తే మిగిలిన మండలాలన్నీ మెట్టప్రాంతాలు కావడంతో వేరుశనగ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడింది. వేరుశనగ సాగు ఆశాజనకంగా సాగు కావడం గమనార్హం. అన్నమయ్య జిల్లా భిన్నమైన భౌగోళిక వాతావరణ పరిస్థితులను కలిగి ఉన్న నేపథ్యంలో వేరుశనగ ఆశా వహంగా సాగు కావడం గమనార్హం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కురిసిన అరకొర వర్షానికి వేరుశనగ సాగుకు వాతావరణం అనుకూలించడంతో అంతంత మాత్రమే పంటల సాగు విస్తీర్ణం కనిపిస్తోందని చెప్పవచ్చు.

లక్ష్యాన్ని అధిగమిస్తాం

కడప జిల్లా ప్రత్యేక పరిస్థితులను కలిగి ఉంది. ఇప్పుడిప్పుడే సాగు పూర్తిస్థాయిలో ఊపందుకుంది. ఇదేతరహాలో ముందుకు సాగుతాం. సెప్టెంబర్ నాటికి ఖచ్చితంగా నిర్దేశిత లక్ష్యాన్ని అందు కుంటాం.

- ఎ.నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, కడప.

ప్రతి ఓటమి మరో విజయానికి నాంది

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి -రాయచోటి

విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని, ప్రతి ఓటమి మరో విజయానికి నాంది అని రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో 2వ సౌత్ జోన్ 'టార్గెట్ బాల్' ఛాంపియన్‌షిప్ -2024-25 మెన్అండ్‌ఉమెన్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి, మంచి పేరు తీసుకు రావాలన్నారు. పోటీలలో ఓడినవారు నిరు త్సాహం చెందకుండా రాబోయే ఆటలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడలలో గెలుపు, ఓటమి సమానమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో క్రీడా కారులు ముందుకు వెళ్లాల న్నారు. విద్య మనకు ఎలా జ్ఞానాన్ని ఇచ్చి మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలూ మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణతగల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యతనిస్తూ విద్య, ఉద్యోగాలలో మొదటి ప్రధా న్యత ఇస్తుందన్నారు. పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న టార్గెట్ బాల్ క్రీడా పోటీలలో తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రిని వ్యాయామ ఉపా ధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరు రాష్ట్రాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా కారులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదివారం తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. దీంతో ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏ ఒక్కరూ సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజల సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. జిల్లాలోని అధికారులందరూ బాధితుల సమస్యలను సీరియస్‌గా తీసుకుని వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తామని వారికి భరోసానిచ్చారు.

మంచిరోజులొస్తాయి.. భయపడొద్దు

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహిళ సమస్యలు వింటున్న వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

మంచి రోజులొస్తాయి.. ఎవరూ భయపడొద్దు.. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం పట్టణంలోని తన కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ కలిసిన వైసిపి నాయకులు, కార్యకర్తలు అభిమానులతో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉందని, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది, మళ్లీ ప్రజల్లోకి వస్తానని, భవిష్యత్ మనదే అని వైసిపి శ్రేణులకు జగన్ ధైర్యం చెప్పారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ నాయకుతో చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు, పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకూ తనతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తోడుగా ఉంటుందని వైఎస్ జగన్ భరోసానిచ్చారు. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా అడుగులు వేయాలని శ్రేణులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కొంతమంది కార్యకర్తలు, అభిమానులు అభిమానులు వారి ఆరోగ్య, నిరుద్యోగ సమస్యలను వై.ఎస్. జగన్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందిస్తూ వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీ అవినాష్ రెడ్డికి సూచించారు. పట్టణంలోని క్రీడాకారులు వారి సమస్యలను ఆయనకు వివరించడంతో క్రీడల్లో బాగా రాణించి పులివెందులకు, మన రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మీకు ఎప్పుడూ అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు.

ఆప్యాయంగా పలకరింపు..

జగన్ కలిసేందుకు జిల్లాలోని నలంలో నుంచి భారీగా జనం తరలివచ్చారు. ఆప్యాయంగా పలకరిస్తూ వారి నుంచి వినుతులను స్వీకరించారు. పులివెందులకు భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులను ఓపికతో పలకరించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పులివెందులలోని క్యాంపు కార్యాలయం ప్రజలతో కిక్కిరిసిపోయింది.

జిల్లా రాజకీయాలపై ఆరా..

వైసిపి ముఖ్య నాయకులతో జిల్లా రాజకీయాలపై ఆరా తీసినట్లు తెలుస్తుంది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవీ చేజారకుండా ఉండేందుకు ముఖ్య నేతలకు దిశ దశ నిర్దేశించినట్లు సమాచారం. ఎవరైనా జడ్పిటిసిలు అసంతృప్తిగా ఉంటే తమ దగ్గరికి తీసుకురావాలని జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక జరిగేంతవరకు వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లా పరిషత్ పీఠాన్ని చేజారకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా నాయకులను ఉంటుందన్నారు. ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని నాయకులతో అన్నట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకెపాటి అమ్మనాథరెడ్డి, మాజీ శాసన సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, వైఎస్ మనోహర్ రెడ్డి, జిల్లా, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నిరసన తెలియజేస్తున్న సిఐటియు నాయకులు

పాలస్తీనాలో శాంతిని నెలకొల్పాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ఆపి ప్రపంచ శాంతి నెలకొలపాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ సిఐటియు రాయచోటిలోని డైట్ కేంద్రం ఎదురుగా నిరసన తెలిపారు. ఈ సందర్భగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్. చంద్రశేఖర్, ఎ. రామాంజులు మాట్లాడుతూ ఐక్య రాజ్యసమితి నిబంధనలు ఉల్లంఘించి అమెరికా సామ్రాజ్యవాదం సహకారంతో పాలస్తీనాపై మీద దురాక్రమణ చేస్తున్న ఇజ్రాయిల్ దాడిని ప్రతి ఒక్కరు ఖండిచాలని కోరారు. ఆసుపత్రుల్లో, పాఠశాలలపై నిర్దాక్షిణ్యంగా పసి పిల్లల నుంచి వృద్ధుల వరకు క్షిపణులతో దాడి చేసి చంపారని వాపోయారు. రెండేళ్ల పాటు మారణహోమం జరుగుతున్నా సామ్రాజ్య వాద దేశాలు యుద్ధం నివారించలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. శ్రీనివాసులు, ఎ.వి రమణ రాజేశ్వరి, శ్రీలక్ష్మి, సుజాత ఐద్వా జిల్లా కన్వీనర్ యం.భాగ్యమ్మ, సిఐటియు నాయకులు బంగారుపాప, ఖాజాబీ, మాధవయ్య, నాగమణి, షాహిన పాల్గొన్నారు.

పులికొండ ఘటనపై దర్యాప్తు ముమ్మరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట-రాయచోటి మధ్య రహదారిలోని పచ్చని చెట్లతో, ప్రకృతి సోయగాలతో నిండుకొని ఉన్న పులికొండ అటవీ ప్రాంతాన్ని వైసిపి ప్రభుత్వ హయాంలో ఇసుకాసురులు కొండలు తవ్వి ఇసుకను తోడేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా అటవీ ప్రాంతంలో వైసిపి నేతలు చేసిన దురాఘతాన్ని జనసేన పార్టీ రాజంపేట అసెంబ్లీ సమన్వయ కర్త అతికారి దినేష్ ప్రశ్నించి అప్పటి ఆర్‌డిఒతోపాటు డిఎఫ్ఒ వివేక్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో ఇటీవల రాజంపేట నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతమైన అన్నమయ్య డ్యామ్ పరీవాహక ప్రాంతాల సందర్శనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి అతికారి తీసుకెళ్లారు. సీరియస్‌గా తీసుకున్న డిప్యూటీ సిఎం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఆదివారం పులికొండ అటవీ ప్రాంతాన్ని పరిశీలనకు పంపారు. డిఎఫ్ఒ స్పెషల్ స్క్వాడ్ అధికారి శివకుమార్ ఆధ్వర్యంలో విచారణకు రాగా అతికారి దినేష్ వారికి పలు విషయాలు వివరించారు. పులికొండ అటవీ ప్రాంతంలో ప్రత్యేక బృందం పర్యటించి అక్కడ జరిగిన ఉదాంతం దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా అతికారి దినేష్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో పచ్చదనంతో నిండిన అటవీ ప్రాంతాన్ని ధనదాహంతో నాశనం చేశారన్నారు. పత్యేక బృందం మరికొన్ని రోజులు లోతైన విచారణ అనంతరం నివేదికను డిప్యూటీ సిఎంకు సమర్పించనున్నట్లు సమాచారం.

విచారణ బృందంతో మాట్లాడుతున్న అతికారి దినేష్

'పుట్టపర్తి' రచనలను వారసత్వంగా రక్షించాలి

ప్రజాశక్తి -కడప అర్బన్ : మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణచార్యుల అముద్రిత రచనలను తెలుగుజాతి వారసత్వ సంపదగా భావించి రక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పుట్టపర్తి నారాయణచార్యుల వర్ధంతిని పురస్కరించుకొని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణాచార్యులు మిగతా కవులతో పోలిస్తే ఎంతో విభిన్నమైన వారని, శిఖర సమానులని కొనియాడారు. కార్యక్రమంలో రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి సంస్థ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు మాట్లాడుతూ వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, బాల ఎల్లారెడ్డి, గంగాధర్, మధు బాబు, డేవిడ్, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు రావచ్చుననే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని విద్యాసంస్థలకు, జూనియర్ కళాశాలకు, ఎయిడెడ్ యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు సెలవు ప్రకటించామని పేర్కొన్నారు..ఈ ఉత్తర్వులను సంబంధిత యాజమాన్యాలన్ని విధిగా పాటించాలని ఆ ప్రకటనలో కలెక్టర్ ఆదేశించారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బి.సందప్ప

ప్రజాశక్తి - రాయచోటి



ముఖా ముఖి..

జిల్లాలోని బిసి సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు అందుబాటులో ఉండి వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే తమ లక్ష్యమని బిసి సంక్షేమ శాఖ అధికారి బుక్కే సందప్ప నాయక్ పేర్కొన్నారు. జిల్లాలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం బిసి సంక్షేమం కోసం పనిచేస్తుందని, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు విద్యను, సంక్షేమ పథకాలు, మెనూ ప్రకారం పౌష్టికాహారం ఎలా అందిస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో బిసి సంక్షేమ వసతి గృహాలు, విద్యార్థుల వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా బిసి సంక్షేమ వసతి గృహాలు 45 ఉన్నాయి. ఇందులో మొత్తం 3,168 మంది విద్యార్థులు చదువు తున్నారు. ప్రీ మెటరీ పాఠశాలలో 33, పోస్ట్‌మెటరీ పాఠశాలలో 12 ఉన్నాయి. ప్రభుత్వ భవనాలు 27 అద్దె భవనాలలో 18 ఉన్నాయి. బాలురు సొంత భవనాలు 15, అద్దె భవనాలు 12, బాలికల సొంత భవనాలు 15, అద్దె భవనాలు 3 ఉన్నాయి. 717 మంది బాలురు, 2451 బాలికలు చదువుతున్నారు.

జిల్లాలో వార్డెన్లు వంట మనుషులు ఎంతమంది ఉన్నారు? సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా బిసి వసతి సంక్షేమ అధికారులు 29 మంది, 4వ తరగతి సిబ్బంది 99 మంది పనిచేస్తున్నారు. ఇటీవల కాలంలో కొంతమంది సిబ్బంది ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో విధులు నిర్వహించుకుంటున్నాం.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఇతర కిట్లు పంపిణీ చేశారా ?

విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ప్రస్తుతం వారు చదువుతున్న పాఠశాలలో అందజేస్తున్నారు. కిట్లు కూడా పంపిణీ చేస్తున్నారు. అందరికీ వంద శాతం అందజేశారు..

పౌష్టికాహారం మెనూ గురించి తెలపండి ?

విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టి కాహారాన్ని అందజేస్తున్నాం. వారానికి 5 సార్లు కోడిగుడ్లు రెండు సార్లు చికెన్ ఇస్తున్నాం. ఎప్పటికప్పుడూ పరిశుభ్రమైన ఆహారాన్ని ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ,సాయంత్రం స్నాక్స్, రాత్రి పూట భోజనం అందిస్తున్నారు.

విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు ఇస్తున్నారా?

జిఒ నెం.9, 20-2-2023 ప్రకారం విద్యార్థులందరికీ కాస్మోటిక్ ఛార్జీలు ప్రతినెలా అందజేస్తున్నారు. 3 నుంచి 6 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బాలురుకు రూ.125, బాలికలకు రూ.130,7 నుంచి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బాలురకు రూ .150 , బాలికలకు రూ .200 , ఇంటర్ నుంచి ఆపైన చదువుతున్న విద్యార్థులకు బాలురకు రూ . 200, బాలికలకు రూ.250 ప్రతినెల వారి తల్లిదండ్రుల అకౌంటులో జమ చేస్తున్నాం.

మౌలిక వసతి గృహాలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

వసతి గృహాలు నిర్మాణం కోసం ఉన్న తాధికారులకు ప్రతిపాదన పంపాం. బడ్జెట్ మం జూరైన వెంటనే పనులు మొదలు పెడుతాం.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఎలాంటి తీసుకుంటున్నారు ?

ఈ ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు 550 మంది విద్యార్థులు ఉన్నారు. పదవ తరగతి విద్యార్థులకు వసతి గృహాలలో నైపుణ్యమైన ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం భోజనం సదుపాయాలు కల్పిస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ఏడాది లో పదవ తరగతి విద్యార్థులకు 100 శాతం ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థులకు సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా ?

విద్యార్థులు క్రమం తప్పకుండా రోజూ పాఠశాలకు వెళ్లాలి. ప్రతి రోజు స్నానం చేసి పరిశుభ్రంగా ఉండాలి. విద్యార్థులు తల్లిదండ్రులు కూడా పిల్లలకు సెలవు రోజుల్లో ఇంటికి వచ్చినప్పుడు గమనించి, ఎలా చదువుతున్నారో తెలుసుకొని వారిని ప్రోత్సహించాలి. అలాగే వసతి గృహాలలో విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తను హాస్టల్ తనిఖీకి వచ్చినప్పుడు తనకు విద్యార్థులు తెలియజేయాలి.

సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయిలక్ష్మి

అత్యాచారాలను అరికట్టాలి

-ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి సాయిలక్ష్మి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్. సాయిలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటిలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళల సంఘం (ఐద్వా) జిల్లా కన్వీనర్ ఎం. భాగ్యమ్మ అధ్యక్షతన ఓ ప్రయివేట్ కళాశాలలో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై పెద్ద ఎత్తున దాడులు అనేక రూపాల్లో జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని వాపోయారు. నంద్యాల ప్రాంతంలో చిన్న పిల్లలపై అత్యాచారం చేసి రిజర్వాయువుల్లో పడేస్తే అలాంటి వారి పైన చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రోజూ ఏదో ఒక చోట గంటకు నలుగురు మహిళలు అత్యాచారానికి గురవుతున్నాయంటే ప్రభుత్వం పోలీసు వ్యవస్థను, మహిళ రక్షణ చట్టాలను పష్టింగా అమలు చేయక పోవడమేనని పేర్కొన్నారు. గుడ్లవల్లేరు మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వాష్ రూమ్‌లో రహస్య కెమరాలు పెట్టడం శోచనీ యమన్నారు. స్త్రీ పురుష నిష్పత్తి నానాటికి పడిపోతుందని తెలిపారు. తిరుప తిలో వలస బాలికను బిస్కెట్ పేరుతో అత్యాచారం హత్య చేశారన్నారు. గత ప్రభుత్వంలో గంజాయి వల్ల యువత చెడు మార్గం పట్టిందన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కావాలంటే బిజెపి ప్రభుత్వం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరమెంతైనా ఉందని పిలుపునిచ్చారు. మహిళలకు బాలికలకు రక్షణ కల్పించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు వి.నాగమణి, షహీన, రెడ్డిప్రసన్న, కమలమ్మ, గాయత్రి, రేవతి, సైదాబాను, రాజేశ్వరి,శ్రీలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

ముళ్ల కంపలను తొలగిస్తున్న జెసిబి

ముళ్ల పొదలు తొలగింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో రోడ్డు ఇరువైపులా పెరిగిన ముళ్ళ పొదలు తొలగింపు పనులు ఆర్ అండ్‌బి అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు. రెండు రోజుల నుంచి తంబళ్లపల్లె-మదనపల్లి మార్గంలో, మూలపల్లి బస్టాండ్ వద్ద నుంచి తంబళ్లపల్లె వరకు మూడు కిలోమీటర్ల మేర పెరిగిన చెట్లను జెసిబి సాయంతో తొలగించారు. తంబళ్లపల్లి, ములకలచెరువు, పెద్దమండ్యం మార్గంలో పెరిగిన ముళ్ళ పొదలను తొలగిస్తామని వర్క్ఇన్స్‌పెక్టర్ రమణ తెలిపారు.

నేడు వెంగంవారిపల్లిలో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వెంగంవారిపల్లె పంచాయతీలో సోమవారం కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ జి.శ్రీవాణి నవీన్, మాజీ ఎంపిపి పారిజాత మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎల్.వి ప్రసాద్ కంటి వైద్యశాల ఫీల్డ్ మేనేజర్ కొమ్ము వెంకటేష్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఉచితంగా కంటి వైద్యం అందించాలన్న లక్ష్యంతో మదనపల్లి యల్.వి ప్రసాద్ కంటి ఆస్పత్రి సహకారంతో గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య క్యాంప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఉచిత క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కొరకు 91219 90645 నంబర్‌ను సంప్రదించాలన్నారు. వైద్య పరీక్షలకు వచ్చే వారు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు.

సిపిఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి ఎంఆర్‌సి ఆవరణంలో సిపిఎస్ విద్రోహదినాన్ని పాటిస్తూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఒపిఎస్ విధానం మాత్రమే ఆమోద యోగ్యమని, సిపిఎస్ రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. సిపిఎస్, జిపిఎస్, యూపిఎస్ అంటూ రకం కాల పేర్లతో విధానాలు ప్రకటించడం వలన ఉపాధ్యాయులకు తీవ్ర నష్టమని ఉపా ధ్యాయులు నిరసన తెలిపారు. 117జిఒ రద్దుకు త్వరలోనే నిర్ణయం తీసుకుని, రద్దు చేసి ప్రతీ ప్రాథమిక పాఠశాల లోనూ ఐదు తరగతులు ఉండేలా చూడాలని అన్నారు. ఉపాధ్యాయులకు నాడు-నేడు వంటి ఇతరత్రా అదనపు ఆన్‌లైన్ పను లు నుంచి విముక్తి కల్పించి బోధనకే పరిమితం చేయాలని సంఘ సీనియర్ నాయకులు చెంగల్రాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ ప్రసాద్, శంకర్, అజంతుల్లా, జాకీర్, సంషుద్దీన్ , భాస్కర్, సహదేవ పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వత్తలూరు అటవీ ప్రాంతంలో పుల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యపై ఎలుగుబంటి దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. బాధితుని వివరాల మేరకు..ఆదివారం గ్రామస్తులతో కలిసి ధ్వజస్తంభం కోసం అడవిలోకి వెళ్ళగా ఎలుగుబంటి, ఎలుగుబంటి పిల్లలు ఈశ్వరయ్యపై దాడికి పాల్పడ్డాయి. ఎలుగుబంటి దాడిలో తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు రాజంపేట ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే ఎఫ్ఐఆర్ అడుగుతారని అనుమానంతో ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈశ్వరయ్య చెవికి బలమైన గాయం అయ్యి తీవ్ర రక్తస్రావం జరిగిందని పేర్కొన్నారు.

చికిత్స పొందుతున్న ఈశ్వరయ్య

టిడిపి నాయకుడి మృతికి మంత్రి నివాళి

ప్రజాశక్తి-రాయచోటి

మండలంలోని ఎండపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పివై నరసింహారెడ్డి అనారోగ్య కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఉదయం ఎండపల్లి గ్రామానికి చేరుకొని నరసింహారెడ్డి భౌతిక కాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వృత్తిపట్ల అంకితభావం చాటుకున్న పంచాయతీ కార్యదర్శి

- బెంగళూరుకు వెళ్లి లబ్ధిదారురాలికి పింఛను అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలం, బూచిపల్లి పంచాయతీ, గొడ్లివారి పల్లి గ్రామానికి చెందిన పింఛన్ లబ్ధిదారురాలైన జి.రాజమ్మ బెంగళూరులో సెయింట్ జాన్స్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి సొంత ఖర్చులతో బెంగళూరు వెళ్లి ఆమెకు ఎన్‌టిఆర్ భరోసా వృద్ధాప్య పింఛన్ సొమ్మును అందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లా డుతూ సామాన్య ప్రజల కష్టాలు తనకు తెలుసునని, సామాన్య కుటుంబం నుంచి తాను వచ్చానన్నారు. పింఛన్ సొమ్ము ఆమె వైద్య ఖర్చులకు అవసరమవుతాయనే ఉద్దేశంతో తన బెంగళూరుకు వెళ్లి పింఛన్‌ను అందించినట్లు తెలిపారు. మానవీయతను, వృత్తి పట్ల నిబద్ధతను కనబరిచిన గ్రామపంచాయతీ కార్యదర్శిని అధికారులు, ప్రజా ప్రతినిధులు,సచివాలయ సిబ్బంది అభినందించారు.

పింఛను అందిస్తున్న సురేష్‌రెడ్డి

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ప్రజాశక్తి-నందలూరు

సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టే సామర్థ్యం చంద్రబాబుకే సాధ్యమని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు జంగంశెట్టి సుబ్బయ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసి 29 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులు కేకుకట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జంగం శెట్టి సుబ్బయ్య మాట్లాడుతూ సైబరాబాద్‌ను ఐటి రంగానికి కేంద్ర బిందువుగా చేసి వేలమందికి ఉపాధి కల్పించిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు దేశం పార్టీ కార్యదర్శి గొబ్బిళ్ళ సుబ్బరాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు భూశెట్టి వెంకటసుబ్బయ్య, పాటూరు రమేష్, వేణుగోపాల్, రేమో సురేష్, పసుపులేటి ప్రవీణ్, ఉప్పు శెట్టి రెడ్డయ్య, మోడపోతుల రాము, నారపుశెట్టి శివ, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అపర మేధావి అని టిడిపి మాజీ మండల అధ్యక్షులు పొందూరు కొండయ్య, మాజీ ఎంపిటిసి గుడారు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ సర్పంచ్ పత్తిపాటి రవి నాయుడు తెలిపారు.మిట్టమీద పల్లె గ్రామంలో జండా ఆవిష్కరించి కేకు కోసి సంబరాలు జరుపుకున్నారు.

కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు

తొగటవీర క్షత్రియుల అభ్యున్నతికి కృషి

-కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తొగటవీర క్షత్రియుల అభ్యున్నతికి శాయశక్తులా కృషి చేస్తానని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లి పట్టణంలోని చౌడేశ్వరి కళ్యాణ మండపంలో తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో కందికుంట వెంకట ప్రసాద్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తొగటవీర క్షత్రియ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోడెం వీరాంజనేయ ప్రసాద్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన బాబు, చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు పురాణం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బండి పవన్‌కుమార్, కోశాధికారి రామిశెట్టి రత్నమయ్య,మోడెం వెంకటరమణ, ఉప్పు రామచంద్ర, మోడెం సిద్దప్ప, రామిశెట్టి నీలకంఠ, రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, భువనేశ్వరి సత్య, ప్రభాకర్, మోడెం నాగరాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తు తం మారుతున్న కాలానికి అనుగుణంగా తొగటవీర క్షత్రియులు అన్నిరంగాల్లో ముందంజ వేస్తున్నారన్నారు. భవిష్యత్తు లో మరింత ప్రగతిని సాధించాలని ఆకాంక్షించారు. రాజకీయాల్లో సైతం శాసించే స్థితికి తొగటవీర క్షత్రియులు ఎదగాలని అన్నారు. మనం దృఢంగా ఉన్నప్పుడే ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు వాటంతటికి అవే వస్తాయని పేర్కొన్నారు. మనం కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో తాను ఎన్నో ఒడిదొడుకులు, కష్టనష్టాలు చవిచూశానని చివరికి అనుకున్నది సాధించానన్నారు. మదనపల్లి పట్టణం నుంచి శ్రీరామ్ చినబాబు తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా సమర్థవంతంగా పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వద్ద అతనికి మంచి పేరు ఉందన్నారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత పదవిని అలంకరించాని తెలిపారు. అనంతరం శ్రీరామ్ చినబాబు మాట్లాడుతూ తొగటవీర క్షత్రియులు ప్రస్తుతం అన్ని రంగాల్లో స్థిరపడుతూ సగర్వంగా తలెత్తుకుని నిలబడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో పురాణం వెంకటరత్నం, అనంత (సొసైటీ) రామచంద్ర నాగరాజు, వేమయ్య, ఉప్పు శ్రీనివాసులు, శీలం రమేష్, రామలింగయ్య పెద్ద ఎత్తున తొగటవీర క్షత్రియ కుల బాంధవులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



రమణయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రాయచోటి

ఉత్తమ సేవలతోనే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. మండలం గరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు రమణయ్య పదవి విరమణ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగప్రభ ఆధ్వర్యంలో సన్మాన సభను పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యాపరంగా, సామాజిక పరంగా ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు నైతిక విలువలు, సామాజిక స్పృహ, శాస్త్రీయత గురించి నేర్పించాలన్నారు. ప్రస్తుతం పదవి విరమణ చెందిన రమణయ్య తమ బాధ్యతను ఏమాత్రం విస్మరించకుండా, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొం దించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, బంధు మిత్రులు రమణయ్యను పూల మాలలు, దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, గరుగుపల్లి సర్పంచ్ వాసు, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఓబన్న, గాలివీడు ఎంఈఓ 2 శ్రీని వాసులు, రోటరీక్లబ్ సభ్యులు కృష్ణదేవరాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగికి విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని శ్రీ బిపి శేషయ్య సంస్కృత పాఠశాలలో ఆదివారం పదవీ విరమణ పొందిన చింత గింజల మురళి కుటుంబ సభ్యులను పాఠశాల బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ నరేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మురళి తన సుదీర్ఘ ప్రయాణం ఉపాధ్యాయ వృత్తిలో 37 సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో పనిచేయడం విశేషదగ్గ విషయమని పేర్కొన్నారు. అంకితభావంతో, దీక్ష దక్షలతో నిరంతర బోధకునిగా పనిచేసే ఎంతోమంది విద్యార్థుల భవిష్య త్తును తీర్చిదిద్ది ఆదర్శప్రాయంగా నిలిచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా ఎంపిక అవ్వడం జరిగిందని తెలిపారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోకూడదని అన్నారు. ప్రధానోపాధ్యాయులు మురళి మృదుస్వభావి, విద్యార్థుల పట్ల నిరంతర కృషి, పాఠశాల ఇల్లు తప్ప మరే ఇతర విషయాలు తెలియని అపర మేధావి మురళి అని కొనియాడారు. సంస్కృత పాఠశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు దేశ విదేశాలలో మంచి మంచి స్థాయిలో మెలుగుతున్నారని అన్నారు. ఎంఇఒ చక్రధర్ మాట్లాడుతూ జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలను తీసేస్తున్న సమయంలోను బిపి.శాసయ్య సంస్కృత పాఠశాలన్ని ఎయిడెడ్ పాఠశాలగా నిలపడంలో పాఠశాల బృందంతోపాటు ప్రధానోపాధ్యాయులు మురళి ప్రముఖ పాత్ర పోషించాడని కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సారాజు ప్రసాద్, ఎంఇఒ చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, స్టేట్ ఆఫీసర్ జనార్ధన్, వరదారెడ్డి, ప్రధానో పాధ్యాయులు మల్లికార్జున, కృష్ణయ్య, శాంతినికేతన్ కరస్పాండెంట్ అవ్వారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మురళి దంపతులను సన్మానిస్తున్న ఎంఇఒలు

భారతీయ న్యాయ సంహిత పుస్తకాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-నందలూరు

లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో ఆదివారం అరవపల్లిలోని డాక్టర్ జయ భాస్కరరావు కార్యాలయంలో నూతన చట్టాలతో రూపొందించిన భారతీయ న్యాయ సంహిత (ఇంగ్లీష్ వెర్షన్) పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బచ్చు జయభాస్కరరావు మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థి దశ నుంచి మంచి జ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాల అవసరం ఎంతో ఉందని తద్వారా వారి పురోగతికి దోహదం చేస్తుందని అన్నారు. విద్యార్థులకు అవసరమయ్యే మరిన్నీ మంచి పుస్తకములను తమ స్కూల్ గ్రంథాలయంలో ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని తెలిపారు. ఎస్ఐ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ ప్రసిద్ధ కవి తెలిపినట్లు 'చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని పెద్దలు అనుభవ పూర్వకంగా చెప్పారని అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఉపయోగపడే విధంగా మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం కావించి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్. కుర్రామణి యాదవ్, లయన్ కొత్తపల్లి రాజాచారి, న్యాయవాది దాసరి నరసింహులు, వాకర్ మోడపోతుల రాము, వాకర్ గుండు సురేష్, హెచ్ డి ప్రసాద్, గంధం గంగాధర్, ధర్మ తేజ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాల విషయంపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ ఆదివారం పిడిఎస్‌యు నాయకులు మాన్నూరులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వర మాట్లాడుతూ కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో హిడెన్ కెమెరాలు ఏర్పాటు తీవ్ర ఆందోళనకు గురి చేసిందని అన్నారు. దేశంలో మహిళలకు రక్షణ కరువవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియోలు రికార్డు చేయబడ్డాయని అనుమానాలు కూడా కళాశాల విద్యార్థులు లేవనెత్తారని, వీటిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనాథ్, నంద కుమార్ కమిటీ సభ్యులు పృథ్వి, చందు, సోమశేఖర్ రాజు, లోకేష్, మనోజ్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న పిడిఎస్‌యు నాయకులు

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ యువరాజ్

'కేంబ్రిడ్జి' స్కిల్ సర్టిఫికెట్‌లో ప్రతిభ చాటిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్ల సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నిర్వహించిన లింగువా స్కిల్ సర్టిఫికేషన్‌ను అందుకున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఈ ఫలితాలు భాషా సామర్థ్యాన్ని వివరించే అంతర్జాతీయ ప్రమాణమైన కామన్ యూరోపియన్ ఫ్రేమ్‌వర్క్ ఆఫ్ రిఫరెన్స్‌తో సమలేఖనం చేయబడ్డాయని అన్నారు. ఇఇఇ చివరి సంవత్సరం చదువుతున్న ఉదయశంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, ఇసిఇ చదువుతున్న ముడిశెట్టి శివాని, అడపాల సత్యప్రియ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ మూడవ సంవత్సరం చదువుతున్న కార్తీక్ సాయి, జెక్కులేటి కృష్ణసాయి, తబ్బుల మహేష్, సైబర్ సెక్యూరిటీ మూడవ సంవత్సరం చదువుతున్న ఓంకార్ లు సర్టిఫికెట్లు అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ తమ పరీక్షలను బి2 లెవెల్‌తో ఉత్తీర్ణులు అయ్యారని అన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ పరీక్షలో ఉతీర్ణులైన విద్యార్థులను కరెస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ అథర్ సమీనాఖాన్ అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయ దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈనెల 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కార్యక్రమం నిర్వహించే ఎన్‌విఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఉపాధ్యాయులతో సమావేశ మయ్యారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల పరిధిలో ఉన్న ఎంఇఒలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని, భావి భారత పౌరులను తయారు చేసేది గురువులేనని అన్నారు. అలాంటి గురువులను గౌరవించాలని, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. గురుపూజోత్సవ మహోత్సవాన్ని మదనపల్లె లో ఘనంగా చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ నాయుకులు జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ నాయుడు, హేమలత, గాలి రవీంద్ర, రామచంద్ర, ఎస్‌టియు నాయుకులు మధు, రామా దేవి, నరసింహులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పాగొండ ఖలీల్ అహ్మద్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

విగ్రహ ప్రతిష్టాపనను అడ్డుకోవడం దారుణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనను టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల అడ్డుకొని నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని వైసిపి జిల్లా ఉపా ధ్యక్షులు పాగొండ ఖలీల్ అహ్మద్ విమర్శిం చారు. పెద్దతిప్పసముద్రం మండలం, మద్దయ్యగారిపల్లిలో అభయ ఆంజ నేయ స్వామి ప్రతిష్టకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని గ్రామస్తులు ఆహ్వానించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బి.కొత్తకోట మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్‌ను శనివారం రాత్రి 12 గంటల వరకు ఆయన ఫాంహౌస్‌లో గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ కూటమి నాయకులు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథరెడ్డిని రానివ్వకుండా అడ్డుకోవడానికి శాంతియుత నిరసనల పేరిట డ్రామా లాడుతు న్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి దేవుని కార్యక్రమాలకు సైతం రాజకీ య రంగు పులు ముతున్నారని అన్నారు. ప్రజలు వీటన్నింటిని గమనించాలని కోరారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్ట 50 సంవత్సరాలు పూర్తి కావడంతో నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తన అద్భుతం నటనతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకోవడమే కాకుండా బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ ఆస్పత్రిని నిర్మించి పేద ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. సినీ చరిత్రలో చరిత్రలో మరిన్ని రికార్డులు తిరగరాయాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో నందమూరి బాలయ్య అభిమానులు వెంకీ నాయుడు, సయ్యద్, అంజి, చంద్రబాబు నాయుడు, ఇర్ఫాన్, నరసప్ప, వెంకటరమణ,రాజేంద్ర పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈమధ్యన కురుస్తున్న వర్షాలకు ఎక్కడ చూసినా డెంగీ, మలేరియా జ్వరాలు ప్రబలుతున్నాయని అధికారులు తీసుకొని గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పి డిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న పేర్కొన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లి ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం పడక వేసిందని ఎక్కడ చూసినా మురికి నీరు నిల్వ ఉండడంతో దోమల వలన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటివి జ్వరాలు ప్రబలు తున్నాయని అన్నారు. దీనిపైన ఉన్న అధికారులు చర్యలు తీసుకొని గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగు పరచాలని అన్నారు. కార్యక్రమంలో చంద్ర తేజ స్వరూప్ పాల్గొన్నారు.

ఆలయ సిబ్బందికి వెండి పళ్లెం అందజేస్తున్న రామచంద్ర

ఆలయానికి కిలో వెండి వితరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లికి లక్కిరెడ్డిపల్లి మండలం అప్ప కొండయ్యగారిపల్లి కి చెందిన రామచంద్ర అమ్మవారికి ఆదివారం కిలో వెండి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వహణ అధికారి మారుతి ప్రసాద్ ఆలయ సిబ్బందికి వెండి హారతి పళ్లెం, కుంకుమ భరణి అందించారు. ఆఖరి శ్రావణ మాసం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆదిమూలం రామచంద్ర, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణ స్వీకారో త్సవం ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో జరిగింది. సంస్థ వ్యవస్థాపకులు ఎన్ రామ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అంతీతంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ముఖ్యంగా శాంతి రథం, బాడీ ఫ్రీజర్, పాఠశాల విద్యార్థులకు నైతిక విలువలపై శిక్షణ, కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, భవిష్యత్ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పిమ్మట నూతన కార్యవర్గము ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షులుగా భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రసాద్ రెడ్డి, కార్యదర్శిగా పి.రమణప్ప, సహాయ కార్యదర్శిగా నారదరెడ్డి, కోశాధికారిగా సుధీర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా హరినాథ్ బాబు, శ్రీనివాసులు రెడ్డి, విష్ణు కుమార్‌రెడ్డి, బోర్డు డైరెక్టర్లుగా గురుప్రసాద్, బి.నారాయణరెడ్డి, వెంకటేష్, సుధా కర్ రెడ్డి, ప్రసాద్‌రావ్‌లు ఎన్నిక కాగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి మోహన్ రూ.10వేలు, రాధికబాయి రూ.5వేలు సంస్థ సేవా కార్యక్రమాలకు విరాళంగా అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని పెద్దకురుపల్లి పంచాయతి మట్లవారిపల్లి గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జనసైనికుల ఆధ్వర్యంలో సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ్య ఆసుపత్రి వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రత్యేకముగా వైద్యుల సలహా మేరకు బి.పి. షుగర్ మరియు ఇసి.జి. పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురు ప్రజలు వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో జనసైనికులు వీరభద్ర , లోకేష్, రెడ్డి శేఖర్, కళ్యాణ్ చక్రవర్తి, చందు,విశ్వనాథ్, నాగేంద్ర, నగేష్ లు వైద్య నిపుణులు ఆర్.ఎం.ఓ ఉమేష్ కృష్ణ తేజ, ఈశ్వరి, పవన్ కుమార్‌పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

క్రైం కార్నర్

బంగారు దుకాణంలో చోరీ

-17 కిలోల వెండి అపహరణ

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలోని డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వెనుక భాగాన ఉన్న బంగారు దుకాణంలో చోరీ జరిగినట్లు రూరల్ సిఐ వరప్రసాద్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు 17 కేజీలను వెండి దొంగలించారని ఆ షాపు యజమాని జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. వారిని వెంటనే పట్టుకుని వారి వద్ద నుంచి దొంగలించిన వెండిని రికవరీ చేస్తామని చెప్పారు. దుకాణం యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.